# లేకి బతుకులు

అరవై ఏండ్ల చంద్రమ్మ చూడడానికి డెబ్బై ఏండ్ల కొడవలిలా కనిపిస్తు వుంది. ముసురుకు తడిసి ఎండిన పత్తి పూవులాంటి తల, జీవకళలేని చూపుతగ్గిన గవ్వ కళ్ళు, ఎముకలకు అంటుకపోయి ముడుతలు పడ్డ చర్మం. వెలసిన ఆదోషాదిరి నలుపు రంగు. ఏదో పని చేస్తేనే కాని పూట గడవని పరిస్థితి. సర్కారు వారి సహాయం ఆమెకు అందనే అందలేదు. మాలవాడలో నివసిస్తున్న మట్టి మనిషి ఆమె.

అది వరికోతల కాలం. కొడవళ్ళు పట్టుకుని జనం బావుల వైపు నడుస్తున్నారు. వాళ్ళల్లో చంద్రమ్మ ఒకతి. పొద్దు బారెడెక్కింది అందరు బావి దగ్గర నిలుచున్నారు.

గుత్తకు యివ్వమని కూలీలు-

లేదు కూలీకే పనిచెయ్యమని రామిరెడ్డి కొడుకు శివ్‌రెడ్డి. పనగలి దగ్గర నిలుచోని పనిచేయగలిగిన వాళ్ళను పొలంలోకి పంపిస్తు వుంది, శివ్‌రెడ్డి భార్య సుశీల.

మొదట రెండు మళ్లు కొయ్యంగానే మెదను పక్కకు పెట్టిస్తే రాలిన రాగి ఆకులమ పనికి రాని గడ్డి పోచలను ఏరేస్తే కళ్ళం చెయ్యొచ్చు అని భార్యతో చెప్పి కూలీల వైపు నడిచాడు.

మందిలో అకర్న వొచ్చిన చంద్రమ్మను ఆపి-

"నీకేం చేతనైతదే రెక్కాడిచ్చి కోయలేవు. కొట్టలేవు'. అంది

"అదేం దొరసాని యియ్యాలేం కొత్తంగ కోస్తున్ననా కలుపు, కోత, కల్లం అన్ని సేసి సేసి ముసల్దాన్ని అయిన"

వేలితో కొడవలి పదును తాకి చూస్తూ అంది.

'చేసినన్ని రోజులు చేసినవు చేతగాకుంట అయినంక యింకా చేస్తవా"

"మరిపూట ఎట్లా ఎల్‌తది. నీ కాల్మొక్తా"

"నీవు కొయ్యలేవు. జరసేపు అట్ల కూర్చో" అంటు తడిక వేసుకుని వరి మళ్ళ వైపు నడిచింది. సుశీలకు పాతికేండ్లు వయస్సు లక్షణమైతే నేమి ఉన్న యింట్ల పుట్టిన ప్రభావం అయితేనేమి సుశీలలో ఓ మాదిరి నిర్లక్ష్యవైఖరి, ఆమె మాటల్లోను నడకలోను కొట్టొచ్చినట్టు కనిపిస్తూ వుంది."

పనికొద్దనగానే చంద్రమ్మ మనస్సు చిన్నబోయింది. గుండెలో కదిలిన నిరాశను బరువైన శ్వాస ద్వారా వొదులుతూ, మౌనంగ

వెళ్ళి పక్కనే ఉన్న రావి చెట్టు మొదలును ఆనుకుని కూర్చుంది.

చంద్రమ్మ కొడవలితో భూమి మీద కాట్లు పెడుతూ "భూదేవి నీకింత సాకిరి సేస్తే ఏం మిగిలింది?

బావి శోడితే ఏమొచ్చె-

పొలం అచ్చుకడితే ఏమొచ్చె-

సేనుకాస్తే ఏమొచ్చె-

పంట ఎవరి గరిస జేరె-

పాడి ఎవరి యిల్లు జేరె

ఐదేండ్ల పిల్లపుడు ఈ వూరికి కోడలై వచ్చిన నాటినుండి నేటి వరకు ఈ వూరి అన్ని బావుల దగ్గర నాటేసి, కోసి, కొట్టి పుట్లకు పుట్లు పోగుసేస్తే ఏపూటకు ఆ పూటే నాయె- ఏం బతుకులు ఈ ఆకలి బతుకులు. సేసుక బతికే వయసులనే సస్తే బాగుండు. అనుకుంటు బావి వైపు చూసింది. ఒకప్పటి రోజులు గుర్తొచ్చి గతంలోకి వెళ్ళింది.

ఆరోజుల్లో రామయ్య పటేలు,

రెండెకరాల సెలకను తీసుకొని బావి తవ్వించిండు. మొదట గడ్డపార వేసింది. నా పెనిమిటి రాములు, తట్టమోసింది నేను. నీళ్ళు వడగానే దోసిల్లతో పైకి చల్లింది నేనే, ఆ తరువాత ఆయన అక్కన్నే జీతం కుదిరె. నామొగుడు మోటతోలి పొలం పారిస్తేనే కదా! పుట్లు పండి రెండెకరాలు పోయి ఈ రోజు

పదెకరాల పొలం అయ్యింది. మొదట జత ఎడ్లతో మొదలై యియ్యాల ఐదారు జతల ఎడ్లు, ఆవులు, బర్లు! మోటలు పోయి, ఆయిల్ ఇంజన్ వచ్చె. అది పోయి కరెంటు మోటరొచ్చె. ఇప్పటి మొగోల్లకు మోటల బాదే లేదు. ఆరోజుల్లో ఆలుమొగలకు రాత్రింబగల్లు బాయి, పొలం పనేనాయె. ఆయనతో పాటు పనిచేస్తూ వుండేది. రామయ్య పటేలు పెండ్లం సీతమ్మ. తనను ప్రతి పనికి పిలుస్తూ వుండేది. ఎంత జేసిన తిండి గుడ్డ అంతకంతకే. నొప్పులు రోగాలకు అప్పులే! మాకు పిల్లలు కలగలేదని కనపడ్డ దేవుల్లకు మొక్కుకుంటిమి. మంత్రాలు, తంత్రాలు దేవుళ్ళు, దయ్యాలు ఒక్కటేమిటి తిర్గి తిర్గి పానంఏసారె. ఒకరోజు ఆయనతో-,

'అందరు పట్నమో, బొంబాయో పోయి మంచిగ బతుకుతుంౕడు మనం గూడ పోదాం, లేదా కులవృత్తి గుడ్డలు నేసే బతుకుదాం అంటె యినక పాయె.

సెమటోడిసి నేసినా అప్పేమిగిలే'' అనుకుంటు బావి వైపు చూసింది. ఒక్కసారె కళ్ళల్లో నీళ్ళు తిరిగినయి. రాగి చెట్టు మొదటి నుంచి లేచి బావి వైపు నడిచింది. ఆ వొట్టి మొత్తలు చూడగానే మోటలు గుర్తొచ్చెసరికి చంద్రమ్మ మెదడు మొద్దుబారి పోయింది. ఒకరోజు ఈ బావి మోటకూలి మోటకొడుతున్న తన భర్తముందు పైన మోట-! అట్ల తన పసుపు కుంకుమ రేపున కలసి బ్రతుకు బండలపాలాయె. కళ్ళలో నీళ్ళు తిర్గినయి. బావి కనపడకుండ మసకలు కమ్మినయి. వొడ్డున

కూర్చొని మనసారా ఏడుస్తూ వుంది. అప్పుడు ఆమె చేతులకున్న రాతెండి గోట్ల మీద కన్నీటి బొట్లు రాలుతున్నాయి. చంద్రీ, ఓ చంద్రీ, కోస్తున్న మళ్ళ మధ్య నిలుచున్న సుశీల పిలుపు. కన్నీళ్ళను చినిగిన చీరకొంగుకు అద్దుకుని మొదటి మడివైపు కదిలింది. ఈయ్యాల రామయ్యపటేలు లేడు సీతమ్మ లేదు. ఇది కొత్తతరం అస్తులినే సూసుకుంటుండ్రు కాని అది ఎట్లా వచ్చింది. ఎవరికి కావాలె! సేసేది ఒకరు దోసేది ఒకరు.

"ఓచంద్రీ, రావే, రా. ఈ మెదలు తీసిన మళ్ళలో రాలిన రాగాకును ఏరేసి అట్టనే పరిగేరుకో" అంది.

సరే అన్నట్టు తలవూపి మొదటి మళ్ళో వంగి రాగి ఆకులను ఏరసాగింది. తలనిండా గత కాలపు జ్ఞాపకాలు.

ఈ మళ్ళు అచ్చుకట్టినపుడు పెనిమిటితో పాటు తాను వరాలు పేర్చింది. అరచేతులతో అదిమి చదును చేసింది. అప్పటినుండి పోయినేడు వరకు వరినాటు వేయడం కోతలు కోయటం, మోయటం, కొట్టటం, రాసులు పోయటం, కూలి గింజలు తీసుకుని పోవటం జరుగుతూ వొచ్చింది. పొలాల్లో నీళ్ళతోపాటు తమ రక్తం చెమటవలె పారింది. ఈనాడు సేతకాని దానివని పని సేయలేవని పనికి రావద్దంటుండ్రు. ఈ వూరిని ఈ భూమిని నమ్ముకున్నందుకు కూడు-గుడ్డ కరువైంది. ఎన్నడూ కడుపునిండా తిన్నదిలేదు. కంటినిండా నిద్రపోయింది లేదు. పొద్దు వొరిగే వరకు రెండు మళ్ళలోని రాగి ఆకులు ఏరి

కుప్పపోసి, ఏరిన పరిగె పనలను కట్టలు కట్టి వరంమీద పెట్టి పక్కన నిలుచుంది.

చివరి పొలంనుండి వచ్చిన సుశీల:

"ఏమే ఏరటం అయ్యిందా"

అయ్యిందమ్మా అన్నట్టు తల వూపింది. కూలికి రానియ్యకున్న పరిగ ఏరుకో నిచ్చినందుకు సంతోషంగానే వుంది.

"ఆటిని అక్కడ వుంచి రేపురా, వొచ్చి యిన్ని గింజలు అడకపో".

ఏరిన పరిగ పది శేర్లన్నా అవుతయి. ఏరుకొమ్మని వుంచి పొమ్మంటదేమిటి? అనుకుంటు బిత్తరపోయి నిలుచుంది. నోటిలో తడి ఆరిపోయింది. కళ్ళం చేయటానికి తొందర, తొందరగ మెదలను లేపటం వల్లా పనలన్ని పడిపోయినయి. లేకపోతే రెండు మల్లల్ల గంత పరిగా పట్టుకపోయి ఆ మెదలల్లా కలుపు." నడుంకు చేతులు ఆనించి శాసించినట్టు అంది.

'ఏరనైతె ఏరిన మీదయ, ఎక్కడైన ఏరుకున్నోల్లకే పరిగ"

'అట్లయితే సగం తీసుకపో సగం అక్కడ పెట్టు' అంటు బావివైపు నడిచింది. చేసేది లేక చంద్రమ్మ చూస్తు నిలుచుంది. అంతకు ముందున్న సంతోషం ఆవిరైపోయింది. పొద్దు గూకే వేళ్ళ, చేసేది లేక మట్టిలో రాలిన వడ్ల గింజల మీద చంద్రమ్మ చూపులు ఆగినయి. పొద్దున్నే వొచ్చి ఆ లేకినన్నా వూక్కొవాలి.

ఊసేసినంక వాటిని సగం యివ్వమంటదో ఏమో! ఏరిన పరిగ తనకు పూర్తిగ దక్కలేదు! ఈ లేకి అన్నా దక్కుతదో! అయిన లేకిని అడుగుతర, అడుగరులే, అనుకుంటు ఏరిన పరిగెను మెద పక్కమ్మటే పెట్టి బావి వైపు నడిచింది.

★ ★ ★

పొద్దుపొడిచే వరకు చంద్రమ్మ చాట-పొరకతో పొలం వైపు నడిచింది. అప్పటికే యిద్దరు ఆడవాళ్ళు నిన్నటి రెండు మళ్లని పేడతో అలుకుతూ కళ్ళం తయారు చేస్తువున్నారు.

మళ్లలో తాను నిన్న చూసిన వడ్ల గింజలు లేవు! ఆ రాత్రి రెండు మళ్ళను పశువులతో తొక్కించినపుడు మట్టిలో కలిసి పోయినయి. చంద్రమ్మ నిరాశతో నిట్టూర్చుతూ చుట్టు చూస్తు నిలుచుంది. కోసి పేర్చిన మెదలమీద పిట్టలు, కాకులు వాలి గింజలను ఏరుక తింటున్నాయి. కొంగలు మాత్రం వొరాల మీద తిరుగుతు, తడివున్న చోట చేరిన తలకప్పలను, చేప పిల్లలను పొడుచుక తింటువున్నయి.

కళ్ళం అలుకుతున్న తోటి స్త్రీలు చంద్రమ్మను రమ్మని సైగ చేయగ తాను నిన్న ఏరిన పరిగ తొనల వైపు నడిచింది. చంద్రమ్మ తలనిండా ఆలోచనలే -

యిగ తనను పనికి ఎవ్వరు, రానివ్వరు! రేపో మాపో సస్తే పిండాకూడు కోసం కొన్ని, బియ్యం కావాలి- పరిగ గింజలనన్నా అట్టనే దాసి -వుంచుకోవాలి. యిగ కన్నుమూసేకాలం

దగ్గరొచ్చింది." అనుకుంటు అతి కష్టంగ అడుగు తీసి అడుగు వేస్తూ నడుస్తూ వుంది.

ఆమె అడుగుల కదలికకు కప్ప పిల్లలు, మిడతలు పక్కలకు పరుగెడుతు వున్నయి. పైన గద్దల గుంపు తిరుగుతూ తిరుగుతు వుంది.

డిసెంబర్, 1995.